క్లుప్తంగా

కల్వర్టు పనులు ప్రారంభం



జేసీబీతో మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: మండలంలోని వేదావతి హగరి నది ఉధృతికి కల్లుదేవనహళ్లి వద్ద కోతకు గురైన కల్వర్టు, రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈనెల 10న 'సాక్షి'లో 'కష్టాలు దాటించే దారే లేదా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు, రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈదారి కోతకు గురికావడంతో ఉరవకొండ, దర్గా హొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం, కల్‌హోళ గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. రూ. 40 లక్షలతో పనులు ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బొమ్మనహాళ్: ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. మంగళవారం బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ భవనం, పరిసరాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్‌ఐ నబీరసూల్‌ను ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌ఐలు నబీరసూల్, నాగమధు, ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి సోదరుడు కె.మహానందరెడ్డికి మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి నివాళులర్పించారు. మంగళవారం వేకువజామున కె.మహానందరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెట్టు గోవిందరెడ్డి కోకుర్తిలోని మహానందరెడ్డి ఇంటికెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వై.భీమిరెడ్డి, రాయదుర్గం మార్కెట్‌యార్డు మాజీ చైర్ పర్సన్ ఉషారాణి, కణేకల్లు మండల రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మహానందరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు

కళ్యాణదుర్గం రూరల్: చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని ఏఎఫ్ ఎకాలజీ ప్రతినిధి భాస్కర్ తెలిపారు. మంగళవారం బోరంపల్లిలో రైతు ఆంజనేయులు రెండెకరాలకు పైగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగుచేసిన 20 రకాల పంటలను పరిశీలించారు.

ఇష్టపడి చదివితేనే భవిష్యత్

కూడేరు: ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. రోజూ నాణ్యమైన, రుచికరమైన భోజనం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి పిల్లలను బాగా చదివించాలని వార్డెన్ గురుప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో సమావేశమై పలు ప్రశ్నలు వేసి, వారిలోని విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.

'నేతన్న నేస్తం' అమలు చేయాలి

ఉరవకొండ: నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దేవాంగ ఫంక్షన్ హాల్‌లో దేవాంగ సంఘం నేతలు చెంగల మహేశ్వర, నిమ్మల వెంకటరణ, ఎంసీ నాగభూషణం, మిడతల చంద్రమౌళి, విశ్వనాథ్, సాధువెంకటస్వామి తదితరులు విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టుల్లో ఆప్కో చైర్‌పర్సన్‌గా దేవాంగ కులానికి చెందిన సజ్జా హేమలతను నియమించడం సంతోషకరమని, చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం చేయూత నివ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అపహరణ కేసులో నిందితుల అరెస్ట్

కంబదూరు: దుండగులు అపహరించుకెళ్లిన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... ఇటీవల కంబదూరుకు చెందిన రైతు తన రూ.4.30 లక్షల విలువైన ట్రాక్టర్ అపహరణకు గురైనట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ నీలకంఠేశ్వర ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా ఆధారాలతో కంబదూరుకు చెందిన విజయ్‌సింహ, కేబీ గంగాధర్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ట్రాక్టర్ అపహరించుకెళ్లినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నిధులు అరకొర..నీరు పారేదెలా?

- బడ్జెట్‌లో ప్రాజెక్టులపై చిన్నచూపు
- హెచ్‌ఎల్‌సీ ఆధునికీకరణపైనా నిర్లక్ష్యం
- రూ.30 కోట్లతోనే సరిపెట్టిన పయ్యావుల కేశవ్
- బీటీ ప్రాజెక్టుకు నీరివ్వడం కష్టమే



బీటీప్రాజెక్ట్



హెచ్‌ఎల్‌సీ

రాయదుర్గం: రాయదుర్గం ప్రాంత వాసులకు ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఏమాత్రమూ నెరవేరేలా లేవు. సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం సాగునీటి రంగానికి తీరని అన్యాయం చేసినట్లయ్యింది. ప్రధానంగా ఇరిగేషన్, వ్యవసాయ రంగాలకు అంకెల గారడీ తప్ప.. ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. అధికారమిస్తే అన్నీ చేస్తామని అలవిగాని హామీలిచ్చారు. ఆర్థికమంత్రి పయ్యావుల ప్రవేశపెట్టిన 2024–25వ వార్షిక బడ్జెట్‌లో బీటీ ప్రాజెక్టు ప్రస్తావనే లేకపోవడంతో ఈ ప్రాంత రైతన్నలకు నిరాశే మిగిల్చింది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలేని సురేంద్రబాబులు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఊరూరా తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే బీటీ ప్రాజెక్టుకు నీరిస్తామని రైతులను నమ్మించారు. తొలిపద్దులో మాత్రం బీటీ ప్రాజెక్టు ప్రసావనే లేదు. దీన్నిబట్టి చూస్తే ఇప్పట్లో ఈ పనులు ప్రారంభమయ్యేలా కనిపించలేదని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతు పక్షాన శాసనసభలో ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

అరకొర నిధులపై మండిపాటు..

జిల్లాలో సాగు, తాగునీటి రంగానికి తలమానికంగా చెప్పుకునే హెచ్‌ఎల్‌సీ ఆధునికీకరణపై కూటమి ప్రభుత్వం నీలినీడలు కమ్మించింది. ఫేజ్–1 రూ.108 కోట్లు, ఫేజ్–2 రూ.684 కోట్లు మొత్తం రూ.792 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా, కేవలం రూ.30 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించింది. ఇప్పటికే కాలువ గట్టు బలహీనంగా మారింది. తరచూ గండ్లు పడుతున్నాయి. పలుచోట్ల అక్విడేట్లు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సైడ్‌వాల్స్, లైనింగ్ దెబ్బతింది. ఈ నేపథ్యంలో టీబీ డ్యాం నుంచి కావాల్సిన నీటి కంటే తక్కువ నీటిని డ్రాచేసే పరిస్థితి కనిపిస్తోంది. ప్రత్యేక నిధులు కేటాయిస్తే తప్పా చివరి ఆయకట్టుకు సమృద్ధిగా నీరందడం సాధ్యం కాదు.

ప్రాజెక్టు మరమ్మతులకు మంగళం..

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బీటీపీ, పీఏబీఆర్, మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధికి బడ్జెట్‌లో పైసా విదల్చకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. బీటీ ప్రాజెక్ట్ వద్ద ఆధునికీకరణ పనులు ప్రశ్నార్థకంగా మిగలడంతో గేట్లు, హెడ్ స్లూయిస్ కింద సాగునీరు వృథా అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల టీబీడ్యాం 13వ క్రస్ట్ గేట్ ఉన్నట్టుండి కొట్టుకుపోయింది. ఆ సమయంలో సాగునీరంతా వృథా అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల అభివృద్ధి పై కూటమి సర్కారుకు ముందుచూపు కొరవడింది. ఆర్థిక మంత్రి పయ్యావుల సొంత జిల్లాకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత దక్కలేదని రైతులు విమర్శిస్తున్నారు.

అంకెల గారడీనే



కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన తొలి బడ్జెట్ కేవలం అంకెల గారడీగా మారింది. సూపర్‌సిక్స్ హామీలు దేవుడెరుగు.. సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసింది. హంద్రీనీవా కాలువ వెడల్పునకు ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు జరగలేదు. బీటీ ప్రాజెక్టుకు నీరిస్తామనే ప్రస్తావన ఎక్కడ తీసుకురాలేదు. ముఖ్యంగా హెచ్‌ఎల్‌సీ కాలువ ఆధునికీకరణకు తీరని అన్యాయం చేశారు. రూ.792 కోట్లు అవసరమైతే కేవల రూ.30 కోట్లు కేటాయించడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ తీరు చూస్తే ఏ రంగానికీ ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదు.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

నిబంధనలు మేరకే విస్తరణ

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండల కేంద్రంలో నిబంధనల మేరకే ఎన్‌హెచ్–150 జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈ, జాతీయ రహదారి విస్తరణ అధికారులు, తహసీల్దార్ అనిల్‌కుమార్, డీటీ బసవకుమార్, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలసి పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ: మండలంలోని రాకెట్లకు చెందిన శివ, ఈశ్వరమ్మ దంపతులు మంగళవారం మధ్యాహ్నం తర్వాత వారి పొలంలోనే పురుగుల మందు తాగారు. పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఇద్దరినీ చుట్టుపక్కల పొలాల్లోని రైతులు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. 15 ఏళ్ల క్రితం వివాహమైన శివ, ఈశ్వరమ్మకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో దంపతులు తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లుగా సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

రాయదుర్గంటౌన్: చదువుకోవడం ఇష్టం లేక ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు విద్యార్థులను కర్ణాటకలోని హుబ్లీ రైల్వే స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం రాయదుర్గం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ మేరకు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. స్థానిక కల్లీ మఠం మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శివరుద్ర, శివరామచంద్ర సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. పొరుగున కర్ణాటక పోలీసులకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు. ఈ క్రమంలో పిల్లలు రైలులో బళ్లారి మీదుగా హుబ్లీకి చేరుకుని స్టేషన్‌లో తచ్చాడుతుండగా అక్కడి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ వెంకటేశులు, వన్నూరురెడ్డి మంగళవారం హుబ్లీకి వెళ్లి పిల్లలను ఆధీనంలోకి తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించనున్నట్లు సమాచారం.

పొలంలో ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో పొలం పనులు చేస్తుండగా ట్రాక్టర్ ఢీకొని పార్వతి (40) మంగళవారం మృతిచెందింది. వివరాలు..గ్రామానికి చెందిన సిద్ధలింగ గ్రామ సమీపంలోని పొలంలో మొక్కజొన్న పంట కూలీలతో కలిసి నూర్పిడి చేస్తున్నారు. ఆసమయంలో పార్వతి, నీలమ్మ కలిసి మొక్కజొన్న సొప్పను ట్రాక్టర్‌లో వేస్తుండగా సిద్ధలింగ ట్రాక్టర్‌ను రివర్స్ చేసే క్రమంలో ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ నబీరసూల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలు గతంలో రెండు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. సిద్ధలింగ పార్వతి చెల్లెలు నీలమ్మను కూడా పదేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: నిబంధలనకు విరుద్ధంగా ఎరువులు విక్రయిస్తే ఫర్టిలైజర్స్ షాపు లైసెన్సులు రద్దు చేస్తామని కంట్రోల్ స్క్వాడ్ సహాయ వ్యవసాయ సంచాలకులు రవి, ఏఓ జగదీష్ హెచ్చరించారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని పలు ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ చేశారు. మధు ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలు, విక్రయాల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు రూ.5,60,850 విలువ చేసే 38.65 టన్నులు ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఎరువుల దుకాణంలో ఎరువులను కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదు పొందాలన్నారు.

విడపనకల్లు: గడేకల్లులో మంగళవారం ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారి పెన్నయ్యతో కలసి ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా అమ్ముతున్న రూ.5లక్షల ఎరువులను సీజ్ చేశారు.

ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

శెట్టూరు: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. మంగళవారం శెట్టూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ సలీం బాషా, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ రమేష్‌నాయక్, ఎంపీడీఓ రఘురామరావు, ఎస్‌టీఓ కోనయ్య, ఎస్‌ఆర్పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. అధికారులు సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. మండలంలోని 16గ్రామపంచాయతీల పరిధిలో ఏడాది కాలంలో రూ.10.80 కోట్ల నిధులతో 857 పనులు చేపట్టగా.. అందులో రూ.1.18 కోట్లు దుర్వి నియోగమైనట్లు వివరించారు. ఒక్క కునుకూరు పంచాయతీలోనే రూ.21 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. అన్ని పంచాయతీల నుంచి రూ.4,00,640 సొమ్ము రికవరీ చేయాలని ఏపీఓ నీరజను అధికారులు ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

'పోలీసులే కేసు నీరుగారుస్తున్నారు'

అనంతపురం ఎడ్యుకేషన్: తన భర్త మోసగించి అబార్షన్ మాత్రలు మింగించాడని ఆధారాలతో సహా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని కంబదూరు మండలం చెర్లోపల్లిలో టీచరుగా పని చేస్తున్న కె.మహేష్ సతీమణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన చేసింది. ఎస్పీ ఆదేశాలతో అనంతపురంలోని దిశ స్టేషన్ డీఎస్పీ విచారించారని ఆధారాలు పరిశీలించి కేసు నమోదుకు కళ్యాణదుర్గం పీఎస్‌లో కలవాలంటూ సలహా ఇచ్చారని పేర్కొన్నారు. అక్కడి పోలీసులు కేసు కట్టకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారంటూ వాపోయింది. బాధితురాలి పక్షాన కాకుండా నిందితుడికి అండగా నిలుస్తున్నారంటూ ఆరోపించారు. తనకు అబార్షన్ జరిగిన 23 రోజుల తర్వాత మెడికల్ చెకప్‌కు పంపుతామని అంటున్నారని పేర్కొంది. తనకు ముందుగా వివాహం జరిగిందంటూ భర్త చెబుతున్నాడని వాస్తవానికి తనకు బాల్య వివాహం జరిగిందన్నారు. తమ పెద్దలు, పోలీసులు జోక్యం చేసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. ఈ విషయం తన పెళ్లికి ముందు పెద్ద మనుషుల సమక్షంలో మహేష్‌కు చెప్పామన్నారు. ఆయన అంగీకరించిన తర్వాతే పెళ్లికి ఒప్పుకున్నాడన్నారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు తనవద్ద ఉన్నాయన్నారు. తనకు న్యాయం జరిగేదాకా పోరాడతానన్నారు.

'బెల్ట్' మళ్లీ తీశారు



ఆటోలో బెల్ట్ షాప్‌కు మద్యం బ్యాక్సులు సరఫరా చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : ఇటీవల అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది బ్రహ్మసముద్రంలో సీజ్ చేసిన బెల్ట్ షాపు తలుపులు మళ్లీ తెరుచుకున్నాయి. సీజ్ చేసిన గంటల వ్యవధిలోనే ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతల అండతో బెల్ట్ షాపు తెరుచుకోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచే పలు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు ఓ ఆటో ద్వారా మద్యం బాక్సులను సరఫరా చేశారు. ఇది చూసిన స్థానిక పోలీసులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. మండల వ్యాప్తంగా దాదాపు 25 బెల్ట్ షాపులు టీడీపీ ఓ ముఖ్య నేత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ బెల్ట్ షాపులో ఒక్కో బాటిల్‌పై కనీసం రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇళ్ల మధ్యలో బెల్ట్ షాప్ ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు విసుగెత్తి పోతున్నారు.

బాల్యం నుంచే ఆరోగ్యసూత్రాలు పాటించాలి

కణేకల్లు: బాల్యదశ నుంచే ఆరోగ్యసూత్రాలు పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సొల్లాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం–పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో నాగేంద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేపు ప్రజాపోరు ధర్నా

రాయదుర్గంటౌన్: ఈనెల 14న స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ధర్నా జరుగుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున తెలిపారు. ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, తిప్పేస్వామి, రాజు, మారెన్న పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు 8 మందిని విధుల్లోకి తీసుకోవాలని బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు మంగళవారం ఓ ప్రకటన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బెళుగుప్ప: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కాలువపల్లి, దుద్దేకుంట, అంకంపల్లి, రామసాగరం, తగ్గుపర్తి, కోనంపల్లి, జీడిపల్లి, గొల్లలదొడ్డి గ్రామాల్లోని పాఠశాల్లో సభ్యత్వ నమోదు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

బ్రహ్మసముద్రం: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్ సూచించారు. మంగళవారం నూతన ఎస్‌ఐ బాధ్యతలు చేపట్టారు. పోలీపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌ఐను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. భైరవానితిప్ప గ్రామ సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రప్ప, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నింగన్న, జయరాములు, తిప్పేస్వామి, మాజీ డీలర్ మహత్మరెడ్డి, మల్లేష్, రాజన్న పాల్గొన్నారు.

న్యూమోనియా వ్యాధిపై అవగాహన

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో వైద్య సిబ్బంది న్యూమోనియాపై అవగాహన ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ న్యూమోనియా (ఊపిరితిత్తులలో నెమ్ము) పై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమాదేవి, శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొల్లాపురమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

ఉరవకొండ: బూదగవి ఎస్సీ కాలనీలోని కొల్లాపురమ్మ ఆలయానికి సూర్య దేవాలయ చైర్మన్ చిరంజీవి ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త అనంతరామశర్మ, ఆంజనేయులు, నాగమణి తదితరులు రూ.2లక్షల విరాళం అందించారు. అమెరికాలోని గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆర్గనైజేషన్ చైర్మన్ వెలగపూడి ప్రకాశరావు విరాళం ప్రకటించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వజ్రకరూరు: ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉరవకొండ రూరల్ సీఐ చిన్న గౌస్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ చిన్నగౌస్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఐ ఎం.నాగస్వామి, హెడ్ కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఉరవకొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి ఓబులు అన్నారు. మంగళవారం మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యురాలు పావని, సిబ్బందితో మాట్లాడారు. సీహెచ్‌ఓ నాగరంగయ్య, ఏఎంఎఓ సత్యనారాయణ, రిజర్వు సబ్‌యూనిట్ అధికారి గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శేఖర్‌లు పాల్గొన్నారు.

ఫర్నీచర్ వితరణ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి హరిప్రసాద్ మంగళవారం ఫర్నీచర్ అందించారు. బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా రూ.15వేల విలువజేసే ఫర్నీచర్‌ను శంకర్, రుద్రయ్యలతో కలిసి హెచ్‌ఎం వెంకటప్రసాద్‌కు అందించారు. పూర్వ విద్యార్థులకు ఎంఈఓ మల్లారెడ్డి అభినందనలు తెలిపారు.

ఉమ్రాయాత్ర పవిత్రమైనది

రాయదుర్గంటౌన్: ఉమ్రయాత్ర (మక్కా, మదీనా) పవిత్రమైనదని మౌలానా సిరాజ్, అల్‌అమన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ (బెంగళూరు) ప్రతినిధి మహమ్మద్ యూసుఫ్ పేర్కొన్నారు. పట్టణం నుంచి ఈ నెల 20న ఉమ్రా యాత్రకు 120 మంది బయల్దేరి వెళ్తున్నారు. దీంతో మంగళవారం కణేకల్లు రోడ్డులోని ఖలీల్ మసీదులో కిట్లు అందించారు. నిర్వాహకులు బేల్దారి మహమ్మద్ (గౌడ), ఆర్‌ఎంపీ వైద్యుడు అతావుర్ రెహమాన్, బిస్మిల్లా మహమ్మద్ ఖలీల్ పాల్గొన్నారు.

అభ్యాసకులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

వజ్రకరూరు: అభ్యాసకులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమ లక్ష్యమని వయోజన విద్య సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వయోజన విద్యావలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఏపీఎం లలిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పద్మావతి, పద్మా, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

16న మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సు

విడపనకల్లు: జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 16న మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని ఎమ్మార్పీఎస్ నాయకులు కెంగూరి ఎర్రిస్వామి, బండారు కదిరప్ప తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మాదిగల ఆత్మీయ సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు కోరాపురం ఎర్రిస్వామి, ముస్టూరు ఎర్రిస్వామి, ఎల్లప్ప, వేణు పాల్గొన్నారు.

71 మద్యం బాటిళ్ల స్వాధీనం

ఉరవకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుహాసిని, సీఐ రవిచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేశారు. కోనాపురం గ్రామంలో సురేష్ అనే వ్యక్తి నుంచి 19 మద్యం బాటిళ్లు, నెరిమెట్లలో చిదానంద నుంచి 52 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు నరేష్, పోతులయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

18న కనకదాస జయంతి వేడుకలు

కణేకల్లు: అనంతపురంలో ఈనెల 18న నిర్వహించనున్న కనకదాసు జయంతి వేడుకలకు భారీగా తరలిరావాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం కణేకల్లులో జరిగిన కురుబ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుబ సంఘం రాష్ట్ర కోశాధికారి తగరుకుంట కృష్ణ మూర్తి, వసికెరి, కణేకల్లు టౌన్ అధ్యక్షుడు బాగన్న తిప్పేస్వామి, ఆలూరు చిక్కన్న పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 18న జరగనున్న కనకదాసు జయంతి వేడుకలు ఉంటాయని కురుబ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు కోరారు. మంగళవారం పట్టణంలోని భక్తకనకదాసు కల్యాణ మంటపంలో కురుబ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

గుమ్మఘట్ట: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైఖ్య సంఘాల లీడర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను ఏ విధంగా తయారు చేయాలనే అంశాలపై తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ జయరాములు, అధికారులు పాల్గొన్నారు.

కంబదూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పక్కాగా తయారు చేయాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై రెండు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 10 శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి తిప్పయ్య, ఈఓపీఆర్డీ గూడెన్న, ఏపీఓ సుజాత, ఏపీఎం రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జార్జ్ పాల్గొన్నారు.

విడపనకల్లు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ షకీలాబేగం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో అధికారులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ సత్యబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2025 – 26 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు.

బొమ్మనహాళ్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం ఉద్యోగులకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ సాయికుమార్, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, వైద్యాధికారులు కుమారరాజా, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కూడేరు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలను పక్కాగా సిద్ధం చేయాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై మండల అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి శ్రీనివాసులు, ఏఓ విజయ కుమార్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, హౌసింగ్ ఏఈ హనుమప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, ఏపీఓ తులసీ ప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.